# ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

https://trinetnews.com/

తాజా తెలుగు వార్తలు

ప్రతి 3 గంటలకు

98497 67747 | 9494184136

1 PM TO 4 PM

సంపుటి: 01 / సంచిక:27 / పేజీలు :02 / వెల:2/రూ / ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు / శనివారం, సెప్టెంబర్ 11,2026


ఉద్యోగాలు ఇస్తానని చెప్పింది

## నేనా అధ్యక్ష..?

### మా రాహుల్ గాంధీ : మాక్ అసెంబ్లీలో సీఎం తలసాని



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు12

తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మాక్ అసెంబ్లీ నిర్వహించగా.. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు శాసన సభ స్పీకర్‌గా వ్యవహరించారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ సభ్యులు సభలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి పాత్రలో తలసాని శ్రీనివాస్‌యాదవ్ తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అశోక్ నగర్‌లో ఉద్యోగాలు ఇస్తానని చెప్పింది నేనా అధ్యక్ష..? ఎన్నికల ముందు అశోక్‌నగర్‌లో ఉద్యోగాలు ఇస్తమని చెప్పింది.. మా రాహుల్ గాంధీ చెప్పిండు.. ఆయనను పోయి అడగండి.. అంటూ చురక లంటించారు. హార్వర్డ్ యూనివర్శిటీలో చదువు కొని నేనేదో నేర్చుకొని మీకేదో నేర్పిద్దాం అంటే మళ్లా నాపాత భాషనే పేగులు మెడలేసుకుంటా అని మొదలు పెట్టాలా..? ఏరోస్పేస్..విమానం ఎక్కడ తయారైతది అని అంటే దిల్ సుఖ్‌నగర్.. మరి కాకపోతే ఎక్కడ అయితది.. మీ ఇంటికాడా అయితదా..? మీ కోరుట్లలో అయితదా..? కాబట్టి నాకున్న పరిజ్ఞానంతోని మావాళ్లు చెప్పిన అంశాలనే నేను చెబుతున్నాన్నారు తలసాని.

## మాటల్లో కోతలు.. ఉద్యోగుల వేతనాల్లో కోతలు..


# ఇదేనా ప్రజాపాలన



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు12

- రేవంత్ రెడ్డిని నిలదీసిన హరీశ్‌రావు మాటల్లో కోతలు.. ఉద్యోగుల వేతనాల్లో కోతలు..
- ఇదేనా రేవంత్ రెడ్డి చెప్పే ప్రజా పాలన అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు.
- రేవంత్ రెడ్డిని నిలదీసిన హరీశ్‌రావు


## ఏడేళ్ల తర్వాత భారత్‌కు వచ్చిన చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్..!



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు12

చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భారత్‌కు చేరుకున్నారు. 18వ బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు శనివారం న్యూఢిల్లీకి వచ్చిన ఆయన.. దాదాపు ఏడేళ్ల తర్వాత భారత్‌లో అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, జిన్‌పింగ్ మధ్య ద్వైపాక్షిక భేటీ జరగనుంది. బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో ఇరు దేశాల సంబంధాలపై కీలక చర్చలు జరిగే అవకాశం ఉంది. జిన్‌పింగ్‌తోపాటు చైనా కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో స్టాండింగ్ కమిటీ సభ్యుడు, పార్టీ కేంద్ర కార్యాలయ డైరెక్టర్ కై కీ, పొలిట్‌బ్యూరో సభ్యుడు, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ భారత్‌కు వచ్చారు.

## బొత్స సత్యనారాయణ మళ్లీ ఏడ్చారు.. మూడు రోజుల్లో రెండోసారి



అమరావతి :ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు12

ఏపీ వైసీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి , శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ మరోసారి కంటతడి పెట్టుకున్నారు. మూడు రోజుల్లో రెండుసార్లు భావోద్వేగానికి గురై కన్నీరు కార్చారు. విజయనగరం జిల్లా వైసీపీ సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది.ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ జిల్లాలో బొత్స సత్యనారాయణ సేవలను కొనియాడుతూనే ఆయన కుటుంబ సభ్యుడు మేనల్లుడు, జడ్పీ చైర్మన్ చిన్న శ్రీను వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. దీంతో ఒక్కసారిగా భావోద్వేగానికి గురైన బొత్స కంటతడి పెట్టుకోవడం అక్కడివారిని కలిచి వేసింది.



## కాంగ్రెస్ నిర్లక్ష్యంతోనే రాష్ట్రంలో కరువు

### మాక్ అసెంబ్లీలో జగదీశ్‌రెడ్డి ధ్వజం

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు12

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే తెలంగాణలో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీలో మాట్లాడిన ఆయన.. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో తెలంగాణకు నీటి విషయంలో అన్యాయం జరిగిందని, కాళేశ్వరం ప్రాజెక్టుతో రాష్ట్రంలోని సాగునీటి పరిస్థితులు గణనీయంగా మారాయని అన్నారు. పోతిరెడ్డిపాడు నుంచి శ్రీశైలం నీటిని అక్రమంగా తరలించారని విమర్శించారు.బీఆర్ఎస్ హయాంలో తెలంగాణలో రెండు కోట్ల ఎకరాలను సాగులోకి తీసుకొచ్చిన ఘనత కేసీఆర్ దేనని జగదీశ్‌రెడ్డి అన్నారు.

02

శ్రీకాకుళం నుంచి పల్నాడు వరకు వర్షాలు..

## ఏపీఎస్డీఎంఏ అలర్ట్

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు12

- అల్పపీడనం ప్రభావంతో ఏపీలో వర్ష సూచన
- కోనసీమ, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్ జిల్లాలకు భారీ వర్ష హెచ్చరిక
- గంటకు 60 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం
- శ్రీకాకుళం నుంచి పల్నాడు వరకు వర్షాలు కురుస్తాయని అంచనా



02



## కేసీఆర్ నా సూచనలు పట్టించుకోలేదు..

### రేవంత్ రెడ్డి ఆ తప్పు చేయకూడదు: రాజాసింగ్

- హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీ చేయడానికి
- నిధులు మంజూరు చేయడాన్ని స్వాగతించిన రాజాసింగ్

నిధుల వినియోగంలో స్థానిక

- ఎమ్మెల్యేలను భాగస్వాములు చేయాలని విన్నపం

ముందుగా బస్తీలు, గల్లీల్లో ప్రాథమిక సమస్యలు తీరాలని సూచన

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు12

తెలంగాణ శాసనసభలో 'కోర్ అర్బన్ రీజియన్ ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ బిల్లు' (జఖ=జు దీఅశ్రీశ్రీ) పై జరిగిన చర్చ సందర్భంగా గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారుల తీరుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వంలో ఎమ్మెల్యేల ప్రతిపాదనలకు ప్రాధాన్యత ఇవ్వడంలేదంటూ ఆవేదన వ్యక్తం చేసిన ఆయన... శాసనసభ్యులు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా లేదా ప్రజా సమస్యలపై సూచనలు చేసినా కనీసం పట్టించుకునే పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు. హైదరాబాద్ నగరాన్ని గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కోట్లాది నిధులు మంజూరు చేయడం ఆహ్వానించదగిన పరిణామమే అయినప్పటికీ... ఆ నిధుల వినియోగంలో స్థానిక ఎమ్మెల్యేలకు తగిన భాగస్వామ్యం కల్పించాలని కోరారు.



2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే

# తెలంగాణ లక్ష్యం

- హైదరాబాద్ లో వికేంద్రీకృత నగర పాలనను
- అందుబాటులోకి తెస్తున్నామన్న శ్రీధర్ బాబు
- దీని కోసమే క్యూర్ యాక్ట్ 2026ను రూపొందించామని వెల్లడి
- హైదరాబాద్ ప్రపంచ స్థాయి మెట్రోపాలిటన్ సిటీగా ఎదిగిందన్న మంత్రి

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు12

హైదరాబాద్ నగరంలో రాబోయే 20 నుంచి 30 ఏళ్ల భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా వికేంద్రీకృత నగర పాలనను అందుబాటులోకి తెస్తున్నట్లు తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఇందుకోసమే ప్రత్యేకంగా 'క్యూర్ (జఖ=జు) యాక్ట్- 2026' శాసనాన్ని రూపొందించినట్లు శాసనసభలో ఆయన వెల్లడించారు. నగర పరిపాలనను మరింత వేగవంతంగా, పారదర్శకంగా, ప్రజా సమన్వయంతో ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా తీర్చిదిద్దడమే ఈ కొత్త చట్టం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

మొదటిపేజీ తరువాయి

# కాంగ్రెస్ నిర్లక్ష్యంతోనే రాష్ట్రంలో కరువు

మిషన్ కాకతీయ ద్వారా చెరువులను నింపామని, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ మంచినీరు అందించిన ఘనత కూడా కేసీఆర్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి తొమ్మిది జిల్లాలకు నీరు అందిందని జగదీశ్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ మినహా మిగిలిన ఉమ్మడి జిల్లాలకు కాళేశ్వరం నీళ్లు పారాయని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లాల్లో కాళేశ్వరం నీళ్లు పొంగిపొర్లాయని చెప్పారు.ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్యకు కాంగ్రెస్ ప్రభుత్వాలే కారణమని జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఫ్లోరైడ్‌ను తరిమికొట్టామని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కాలువల నిర్వహణపైనా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. కేసీఆర్ హయాంలో ఎడమ కాలువ గేట్లను తెరిచిన తర్వాత కుడి కాలువ గేట్లు తెరిచేవారని.. ప్రస్తుతం కుడి కాలువ గేట్లు తెరిచిన తర్వాత ఎడమ కాలువ గేట్లు తెరుస్తున్నారని అన్నారు.పోతిరెడ్డిపాడు నుంచి వెలుగొండ ద్వారా ఆంధ్రప్రదేశ్ అక్రమంగా నీటిని తరలించుకుపోతోందని జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. కన్నెపల్లి నుంచి వేల క్యూసెక్కుల నీరు సముద్రంలో కలిసిందని, ఇప్పటికే 150 టీఎంసీల నీరు సముద్రంలో కలిసిందని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని జగదీశ్‌రెడ్డి విమర్శించారు. కాగా, ఈ మాక్ అసెంబ్లీలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్యమంత్రి పాత్ర పోషించారు. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు శాసన సభ స్పీకర్‌గా వ్యవహరించారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ సభ్యులు సభలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

# కేసీఆర్ నా సూచనలు పట్టించుకోలేదు..

గత బీఆర్ఎస్ పాలనలో అప్పటి సీఎం కేసీఆర్ కూడా హైదరాబాద్‌ను గొప్పగా అభివృద్ధి చేయాలని భావించినప్పటికీ... హైదరాబాద్ ప్రజాప్రతినిధులతో సమన్వయ సమావేశాలు పెట్టాలని తాను ఇచ్చిన సూచనలను ఆయన పట్టించుకోలేదని రాజాసింగ్ గుర్తుచేశారు. ఇప్పుడైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ తప్పు చేయకుండా, నగర పరిధిలోని ఎమ్మెల్యేలందరితో కలిసి ప్రత్యేక సమన్వయ సమావేశాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని, స్థానిక సమస్యలపై ప్రజాప్రతినిధుల సలహాలు తీసుకోవాలని కోరారు. హైదరాబాద్ నగరం అంతర్జాతీయ స్థాయికి చేరాలంటే ముందుగా బస్తీలు, గల్లీలలో ఉన్న ప్రాథమిక సమస్యలు తీరాలని రాజాసింగ్ పేర్కొన్నారు. నగరంలో తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థల మధ్య తీవ్ర అస్తవ్యస్త పరిస్థితి నెలకొందని... మంచినీటి సరఫరా ప్రారంభమైన మొదటి 30 నిమిషాలు మురికి నీరే వస్తోందని సభ దృష్టికి తెచ్చారు. కొన్ని ప్రాంతాలలో అర్ధరాత్రి లేదా తెల్లవారుజామున 3, 4 గంటలకు నీరు విడుదల చేస్తుండటంతో ప్రజలు నిద్రలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తగినంత రవాణా, డ్రైనేజీ సదుపాయాలు ఉన్నాయో లేదో పరిశీలించకుండానే బహుళ అంతస్తుల (హైరైజ్) భవనాలకు అనుమతులు ఇవ్వడం వల్ల సమస్య మరింత సంక్లిష్టంగా మారుతోందని విమర్శించారు.

మొదటిపేజీ తరువాయి

## 2034 నాటికి

## 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే

# తెలంగాణ లక్ష్యం

'తెలంగాణ రైజింగ్ 2047' పాలసీ విజన్‌లో భాగంగా 2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని చాటిచెప్పారు.చార్మినార్ నుంచి హైటెక్ సిటీ వరకు, మూసీ తీరం నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు ప్రపంచ స్థాయి మెట్రోపాలిటన్ నగరంగా హైదరాబాద్ ఎదిగిందని మంత్రి కొనియాడారు. ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, డేటా సెంటర్లు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు (+జజ) ప్రధాన కేంద్రంగా మారిన హైదరాబాద్... రాష్ట్ర ఆర్థిక రంగానికి ప్రధాన గ్రోత్ ఇంజన్ అని గుర్తుచేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర జీఎస్‌డీపీ 10.7 శాతం వృద్ధితో రూ.17.82 లక్షల కోట్లకు చేరిందని... ఇందులో క్యూర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలే సింహభాగం భాగస్వామ్యం వహిస్తున్నాయని ఆర్థిక గణాంకాలతో వివరించారు.
ప్రస్తుతం నగరం ఔటర్ రింగ్ రోడ్డు వరకు వేగంగా విస్తరించిన నేపథ్యంలో మౌలిక సదుపాయాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఓఆర్ఆర్ పరిధికి ప్రత్యేక కార్యనిర్వాహక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు ప్రకటించారు. తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధి, ప్రజా రవాణా, ట్రాఫిక్ నివారణ, చెత్త నిర్వహణ, వరదల నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ వంటి కీలక శాఖలను ఒకే గొడుగు కిందకు తెచ్చి నగరపాలనను అంతర్జాతీయ ప్రమాణాలకు చేర్చడమే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు.

# శ్రీకాకుళం నుంచి పల్నాడు వరకు వర్షాలు.. ఏపీఎస్డీఎంఏ అలర్ట్

బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో రానున్న కొన్ని గంటల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. రాగల 6 గంటల పాటు శ్రీకాకుళం నుంచి పల్నాడు వరకు ఉన్న జిల్లాల్లో అల్పపీడన ప్రభావంతో వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ముఖ్యంగా కోనసీమ, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్ జిల్లాల్లో రాగల రెండు గంటల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ వర్షాలతో పాటు గంటకు 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు కూడా వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. పైన పేర్కొన్న మూడు జిల్లాలు మినహా మిగిలిన చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల హెచ్చరికల దృష్ట్యా, అత్యవసరం అయితే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని కోరారు.

మొదటిపేజీ తరువాయి

# ఏడేళ్ల తర్వాత భారత్‌కు వచ్చిన చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్..!

ఈ విషయాన్ని చైనాలో భారత రాయబారి షూ ఫెయిహోంగ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. 2020లో గల్వాన్ ఘర్షణల తర్వాత భారత్-చైనా సంబంధాల్లో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. సరిహద్దు ప్రాంతాల్లో శాంతి కొనసాగడం ద్వైపాక్షిక సంబంధాల అభివృద్ధికి కీలకమని భారత్ పదేపదే స్పష్టంచేస్తోంది. ఈ నేపథ్యంలో జిన్‌పింగ్ పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. ఇటీవల బిష్కెక్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సులో మోదీ, జిన్‌పింగ్ స్వల్పంగా మాట్లాడుకున్నారు.ఇప్పుడు న్యూఢిల్లీలో బ్రిక్స్ సదస్సు సందర్భంగా ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించనున్నారు. భారత్, చైనా మధ్య ద్వైపాక్షిక భేటీకి ఏర్పాట్లు జరుగుతున్నాయని చైనా రాయబారి షూ ఫెయిహోంగ్ తెలిపారు. మోదీ, జిన్‌పింగ్ వరుసగా మూడో ఏడాది సమావేశం కానున్నారని ఆయన చెప్పారు. గతంలో రష్యాలోని కజాన్, చైనాలోని టియాంజిన్‌లో ఇరువురు నేతలు భేటీ అయ్యారని గుర్తుచేశారు. రెండు దేశాల మధ్య సంబంధాలను వ్యూహాత్మకంగా, దీర్ఘకాలిక దృష్టితో ముందుకు తీసుకెళ్లేందుకు చైనా కృషి చేస్తుందని తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

# బొత్స సత్యనారాయణ మళ్లీ ఏడ్చారు.. మూడు రోజుల్లో రెండోసారి

గత మూడు రోజుల క్రితం గిరివిడి మండలంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై , తన మేనల్లుడు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరడంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కంటతడిపెట్టుకున్నారు. మరోసారి శనివారం జరిగిన సమావేశంలో బొత్స మాట్లాడుతూ నమ్మినవారే తనను మోసం చేశారని వాపోయారు.వెన్నుపోటు పార్టీ అరాచకాలు ప్రజలకు తెలియజేయాలని వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాజకీయాల్లో గెలుపు, ఓటములు సహజమని పేర్కొన్నా రు. తనను పిలిచినా వెళ్లకుండా విలువల కోసం వైసీపీలో ఉన్నానని స్పష్టం చేశారు. మూడు నెలల క్రితం కూడా వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని తలుచుకుని ఆయన కన్నీరుకార్చారు..

# అసెంబ్లీని ముట్టడించిన జీహెచ్ఎంసీ కార్మికులు..

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు12

కాంగ్రెస్ సర్కార్ పాలనలో ప్రతీ రోజు ఎక్కడ చూసినా ఏదో ఒక ఆందోళన కార్యక్రమం కొనసాగుతుందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇప్పటికే ఉద్యోగులు, ఆశా కార్యకర్తలు రోడ్డెక్కి ఆందోళన చేయగా.. కొన్ని రోజులుగా పాలిటెక్నిక్ విద్యార్థులు కూడా రేవంత్ సర్కార్ నిర్ణయాలను వెనక్కు తీసుకోవాలని ఆందోళన కొనసాగిస్తున్నారు. తాజాగా జీహెచ్ఎంసీ కార్మికులు కూడా ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా గళం విప్పారు.చెత్త సేకరణ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జీహెచ్ఎంసీ కార్మికులు అసెంబ్లీని ముట్టడించారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకుని అరెస్ట్ చేశారు. ఓ వైపు జీహెచ్ఎంసీ కార్మికులు గో బ్యాక్ గో బ్యాక్ ఖాకీ గో బ్యాక్.. కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి.. అంటూ నినాదాలు చేస్తుంటే మరోవైపు పోలీసులు వారిని బలవంతంగా వ్యాన్‌లోకి ఎక్కించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్మికుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి ఎలా ఉందో ఈ వీడియో కండ్లకు కట్టినట్టు చూపిస్తోంది.



# మంత్రివర్గం నుంచి బర్తరఫ్.. హైకమాండ్ నుంచి పిలుపు..

## కొండాకు క్యాబినెట్ స్థాయి పదవా..?

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు12



మంత్రివర్గం నుంచి బర్తరఫ్ అయిన కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు కొండా సురేఖ వ్యవహారంలో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. ఆమెకు కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి ఢిల్లీకి రావాల్సిందిగా పిలుపు అందింది. వెంటనే బయలుదేరి రావాలని పార్టీ పెద్దల నుంచి ఆమెకు సందేశం అందినట్లు తెలుస్తున్నది. మంత్రివర్గం నుంచి తొలగించిగానే హైకమాండ్ రంగంలోకి దిగడం తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తి రేపుతున్నది.నిన్న తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, కొండా సురేఖతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడారు. పార్టీ నిర్ణయాన్ని గౌరవించాలని, అధిష్ఠానం అండగా ఉంటుందని ఆమెకు హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ సంభాషణ జరిగిన కొద్ది గంటల్లోనే ఢిల్లీ నుంచి పిలుపు రావడం గమనార్హం. మంత్రి పదవి కోల్పోయి అసంతృప్తితో ఉన్న కొండా సురేఖను బుజ్జగించేందుకే అధిష్ఠానం ఈ చర్యలు చేపట్టినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.ఈ క్రమంలో కొండా సురేఖకు కేబినెట్ స్థాయి పదవిని అప్పగించే యోచనలో కాంగ్రెస్ పెద్దలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అధిష్ఠానం పిలుపు మేరకు కొండా సురేఖ ఢిల్లీ పర్యటన తర్వాత ఈ వ్యవహారంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# లైంగిక వేధింపుల ఆరోపణలు..

## 'ఢీ-10' డ్యాన్స్ షో విన్నర్ రాజు అరెస్ట్

### లైంగికంగా వేధించాడని ఓ యువతి ఫిర్యాదు

### సినిమా అవకాశాల పేరుతో మోసం చేశాడని ఆరోపణ

### నిందితుడిని రిమాండ్‌కు తరలించిన మియాపూర్ పోలీసులు

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు12

తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన 'ఢీ-10' డ్యాన్స్ షో విజేత రాజును హైదరాబాద్ మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. లైంగిక వేధింపులకు పాల్పడటమే కాకుండా సినిమా అవకాశాలు ఇప్పిస్తానని చెప్పి మోసం చేశాడని ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్ విధించింది.వివరాల్లోకి వెళితే.. ఓ యువతి ఈ నెల 9న మియాపూర్ పోలీసులకు రాజుపై ఫిర్యాదు చేసింది. తనను లైంగికంగా వేధించాడని, సినీ రంగంలో అవకాశాల పేరుతో వంచించాడని ఫిర్యాదులో పేర్కొంది. దీని ఆధారంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆరోపణలకు సంబంధించి ప్రాథమిక ఆధారాలు లభించడంతో రాజును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.అయితే, రాజు అరెస్ట్ విషయాన్ని పోలీసులు ఇన్ని రోజులు గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది. తాజాగా ఈ వార్త బయటకు రావడంతో చర్చనీయాంశంగా మారింది. యువతి చేసిన ఆరోపణలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తు ముగిసిన తర్వాత వెల్లడయ్యే అవకాశం ఉంది.






# జీహెచ్ఎంసీ విభజనకు అసలు కారణమేంటో చెప్పలేదు

## : ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు12

జీహెచ్ఎంసీ విభజన బిల్లును ప్రవేశపెట్టినప్పుడు ఆయనతోపాటు అందరూ సభ్యులు జనాభా పెరుగుతోంది.. ప్రతీది పెరుగుతున్నాయి.. జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా చేయాల్సిన అవసరముందని చెప్పిన మాటలతో నేను ఏకభవించా. అలానే చేశారు బాగుంది.. అయితే మంత్రి కానీ, ప్రభుత్వం కానీ జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజించేందుకు అసలు కారణం ఏంటో ఈ బిల్లులో మాత్రం ఎక్కడా చెప్పలేదన్నారు ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ.సివిల్ డిపార్ట్‌మెంట్, శానిటేషన్ డిపార్ట్‌మెంట్‌తోపాటు చాలా విభాగాలున్నాయి. ఇప్పుడు జీహెచ్ఎంసీలో ఏం జరుగుతుంది సార్.. ఒక డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే ఉద్యోగి ఇంకో డిపార్ట్‌మెంట్‌కు వెళ్లి పనిచేస్తున్నారు. ఉన్న జీహెచ్ఎంసీలోనే ఉద్యోగుల కొరత ఉంది, వేతనాలు సరిపోవట్లేదు . మరి కొత్తగా ఏర్పాటు చేసిన కార్పోరేషన్లు ఎలా నడుస్తాయి.. ఎవరైనా ఈ ప్రశ్నకు సమాధానమివ్వగలరా..? అని అక్బరుద్దీన్ ఒవైసీ ప్రశ్నించారు.జనాభా ఆధారంగా ప్రతీ కార్పొరేషన్‌లో చదరపు కిలోమీటర్‌కు అవసరమున్న ఉద్యోగులు ఎంతమంది.. టౌన్ ప్లానింగ్ విభాగంలో ఎంతమంది సిబ్బంది అవసరం..శాటిటేషన్ విభాగంలో ఎంతమంది అనే దానిపై వివరణ ఇవ్వలేదు.. కొత్తగా ఏర్పాటు చేసిన మూడు కార్పొరేషన్లకు ఉద్యోగులు ఎంత మంది కావాలి, అంత మందిని ఎలా తెస్తారు..? అని ప్రశ్నించారు.



edited, Printed, Published and Owned by: Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136